గుండెలు అరచేతిలో పెట్టుకుని...



పెద్దిరెడ్డి అనుచరుల అరాచకాలతో ఐదేళ్ల పాటు ప్రాణ భయంతో బతికాం. పుంగనూరులో న్యాయవాదిగా ఉన్న నేను టీడీపీకి సానుభూతిపరుడిగా ఉండడమే నేను చేసిన నేరం. నాపై 11 కేసులు పెట్టి రౌడీషీట్ తెరిచారు. మా ఇల్లు, ఆస్తులపై వైసీపీ మూకలు దాడులు చేశాయి. బాధితులుగా ఉన్న మాపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి, అక్రమ అరెస్టులు చేశారు. ఈ అరాచక పాలన అంతం అయితే తప్ప మేం ప్రశాంతంగా ఉండలేమని అర్థం అయ్యింది. చంద్రబాబు గెలవాలని దేవుళ్లను ప్రార్థించా. ఓట్ల లెక్కింపు రోజు ఎంతో గుండెలు అరచేతిలో పెట్టుకుని గడిపా. వైసీపీ వస్తే కచ్చితంగా మా ఇంటిని ధ్వంసం చేస్తారు. ఊళ్లో లేకుండా వెళ్లిపోయా. టీవీ దగ్గరే గడిపా. టీడీపీ గెలవడంతో ఊపిరి పీల్చుకున్నా. పుంగనూరుకు వచ్చి సంబరాలు చేసుకున్నా. ప్రస్తుతం పుంగనూరు ప్రశాంతంగా ఉంది.

- నవీన్‌కుమార్ యాదవ్

లబ్..డబ్.. లబ్..డబ్.. అంటూ గుండె చప్పుళ్లు బయటకే వినిపిస్తున్నాయి.

22 రెండు రోజుల పాటూ ఓట్లను గుండెల్లో దాచుకున్న ఈవీఎం పెట్టెలు ఏం చెప్పబోతున్నాయి?

ఎవరు గెలవబోతున్నారు?

మళ్లీ అరాచక రాజ్యం వస్తే బతికేదెట్లా?

ఆస్తులు దక్కుతాయా? పొలాలు మిగులుతాయా?


బెదిరింపులు.. కేసులు.. అరెస్టులు.. దాడులు.. దౌర్జన్యాలను ఇంకో ఐదేళ్లు భరించడం సాధ్యమేనా?

..... ఏడాది కిందట సరిగ్గా ఇదే రోజున జిల్లా ప్రజల మదిలో మెదిలిన భయాలోచనలు ఇవి.

వైసీపీ అరాచకాలకు భయపడి నోరు కట్టేసుకున్న జనం, నిశ్శబ్ద ఆయుధంలా పేలారు. ఓట్ల ప్రభంజనం సృష్టించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2019లో కుప్పం తప్ప మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ విజయవిహారం చేసిన పార్టీని 2014లో కుప్ప కూల్చేశారు. విర్రవీగిన నాయకుల నడ్డి విరిచేశారు. అయితే.. ఫలితాల సరళి వెల్లడయ్యేదాకా భీతావహమైన ఉత్కంఠ క్షణాలు జిల్లాలో రాజ్యమేలాయి. వైసీపీ మూకల అరాచకాలను ఎదుర్కొన్నవారూ, బలైనవారూ, పోరాడుతూవున్నవారూ గుండెలు అరచేతిలో పెట్టుకునే గడిపారు. ఒకవేళ మళ్లీ వారే గెలిస్తే.. అనే అనుమాన బీజం వారిని వణికించింది. విజయం కూటమిదే అని వెల్లడయ్యాక జిల్లా ఊపిరి పీల్చుకుంది. అందుకు దారి తీసిన ఐదేళ్ల అరాచక పరిస్థితులనూ, ఓట్ల లెక్కింపు రోజునాటి ఉత్కంఠనూ జనం ఇలా గుర్తు చేసుకుంటున్నారు.

చిత్తూరు

ఆంధ్రజ్యోతి



ప్రాణం.. లేచి వచ్చింది



వైసీపీ వచ్చాక పెద్దిరెడ్డి పుణ్యమా అని నాపై 8 తప్పుడు కేసులు నమోదు చేసి రౌడీషీట్ తెరిచారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన ఘర్షణల కేసుల్లో నన్ను ఇరికించారు. అప్పటి కల్లూరు సీఐ కత్తి శ్రీనివాసులు నా నోట్లో గుడ్డ కుక్కి చిత్రహింసలు పెడుతూ వైసీపీ వాళ్లకు వీడియో కాల్ చేసి చూపించారు. ఇటువంటి చోట బతికేది ఎలా అనుకున్నా. పోలింగ్ రోజున ఓటేసి హైదరాబాద్ వెళ్లిపోయా. ఓట్ల లెక్కింపు రోజు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ టీవీ చూస్తూ గడిపా. టీడీపీ గెలుస్తోందని అర్థం అయ్యాక ప్రాణం లేచివచ్చింది. చావు అంచుల వరకు వెళ్లి వెనక్కి వచ్చినట్లు అనిపించింది. ఆ తర్వాతే హైదరాబాద్ నుంచి పులిచెర్లకు తిరిగి వచ్చా.

- ముళ్లంగి వెంకటరమణ

4 జూన్, 2024

జిల్లా ఊపిరి పీల్చుకున్న వేళ..

వైసీపీ అరాచక పాలనకు జనం సమాధి కట్టిన రోజు

- 2020-21 సంవత్సరాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ నేతలు పెట్రేగిపోయారు. ప్రతిపక్ష నాయకులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, రాళ్ల దాడులు చేయడం, నామినేషన్ వేసినవారిని అక్రమ కేసులతో భయపెట్టడం వంటి అరాచకాలతో అక్రమంగా మెజార్టీ స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారు. చివరికి సార్వత్రిక ఎన్నికల రోజు తెల్లవారుజామున కూడా సదుం మండలం బూరగమందలో పోలింగ్ ఏజెంట్లను కిడ్నాప్ చేశారు.
- 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' కార్యక్రమంలో భాగంగా 2023 ఆగస్టు 4న చంద్రబాబు పుంగనూరుకు వస్తున్న క్రమంలో వైసీపీ నాయకులు, పోలీసులు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ శ్రేణులపై లాఠీఛార్జ్ చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు కూడా పోలీసుల మీద తిరగబడ్డారు. ఈ ఒక్క సంఘటనను ఆధారం చేసుకుని నియోజకవర్గంలో యాక్టివ్‌గా ఉండే టీడీపీ నాయకులు, కార్యకర్తలు 502 మంది మీద హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలోనే సుమారు వంద మందిపై అక్రమంగా రౌడీ షీట్లను తెరిచారు.
- 2022 ఆగస్టు 24, 25 తేదీల్లో కుప్పం చంద్రబాబు పర్యటనలో వైసీపీ నాయకులే జెండాలు కట్టి రెచ్చగొట్టారు. కుప్పంలో అన్నక్యాంటీన్‌ను ధ్వంసం చేసి నిర్వాహకుడ్ని కొట్టారు. అయినా వారిపై కేసులు పెట్టలేదు. పైగా టీడీపీ వారైన 72 మందిపై కేసులు పెట్టి 14 మందిని జైలుకు పంపించారు.
- చంద్రబాబును సొంత నియోజకవర్గంలో పర్యటించకుండా జీవో 1 పేరుతో ప్రభుత్వం అడ్డుకున్న విషయం తెలిసిందే. 2023 జనవరి 4న చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు శాంతిపురం మండలం గొల్లపల్లె క్రాస్ వద్దకు టీడీపీ శ్రేణులు వెళ్లగా పోలీసులు వారిని అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడున్న సీఐ, ఎస్‌ఐలు మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారు. సుమారు పది మందికి గాయాలవ్వగా, నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందారు. 15 మంది మీద హత్యాయత్నం కేసులు నమోదు చేశారు.
- నాణ్యత లేని మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని సోమల మండలం కందూరుకు చెందిన వైసీపీ దళిత కార్యకర్త ఓంప్రతాప్ 2020 ఆగస్టు 25న మదనపల్లెలోని ఓ మద్యం దుకాణం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.సీఎం జగన్‌ను దూషించారు. ఆ వీడియో బాగా వైరల్ అయింది. మరుసటిరోజు ఓంప్రతాప్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు.
- చౌడేపల్లె మండలం బోయకొండలోని భవానీనగర్‌లో ఎకరా డీకేటీ పొలాన్ని సాగు చేసుకుంటున్న దళితులైన శ్రీనివాసులు, రమణమ్మ దంపతుల పొలాన్ని పక్క పొలం వారైన కృష్ణమూర్తి కుమారులు ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. వీరికి స్థానిక వైసీపీ నాయకులు మద్దతుగా వచ్చారు. అందరూ కలిసి మహిళలు, వికలాంగులని కూడా చూడకుండా బాధితులపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు.
- చెన్నై- బెంగుళూరు హైవే నిర్మాణంలో మిగిలిపోయిన కంకరను వైసీపీ నాయకులు బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని పులిచెర్ల మండలం చల్లావారిపల్లెకు చెందిన శివకుమార్ ప్రశ్నించారు. 2022 జూలైలో వైసీపీ కార్యకర్తలు దాడిచేసి కొట్టి రోడ్డు పక్కన పడేశారు.
- సదుం మండలం బూరగమందకు చెందిన రాజారెడ్డి టీడీపీలో యాక్టివ్‌గా వుంటున్నారని 2022 ఏప్రిల్‌లో కిడ్నాప్ చేసి రెండు కాళ్లు విరిచేశారు. కల్లూరులోని పెట్రోల్ బంకు సమీపంలో పడేశారు.
- బీసీసెల్ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌ను లక్ష్యంగా చేసుకుని ఎన్నో దాడులకు పాల్పడ్డారు. రైతు భేరి నిర్వహణకు పోలీసులను అనుమతి కోరితే ఇవ్వలేదు. 2022 డిసెంబరులో ఓ రాత్రి వందలమంది వైసీపీ కార్యకర్తలు కర్రలు, రాళ్లు, రాడ్లతో ఆయన ఇంటిపై దండెత్తారు. ఆస్తుల్ని ధ్వంసం చేశారు. ఆయన ఉద్యోగ మేళా నిర్వహించబోగా, అనుమతి లేదంటూ వేదికను పోలీసులు కూల్చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా రామచంద్రపై యర్రాతివారిపల్లెలో హత్యాయత్నం జరిగింది. దీనిపై ఫిర్యాదు చేసేందుకు వెళితే సదుం స్టేషన్ వద్ద రణరంగం సృష్టించారు.
- 2023 నవంబరు 3న పులిచెర్లకు చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణను అప్పటి కల్లూరు సీఐ శ్రీనివాసులు హైదరాబాదులో అరెస్టు చేశారు. కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కాళ్లు చేతులు కట్టేసి, నోట్లో గుడ్డ కుక్కి దారుణంగా కొట్టారు. సీఐ వెంకటరమణను కొడుతున్నప్పుడు ఎవరో ఓ వైసీపీ నేతకు వీడియో కాల్ చేసి చూపించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమానికి వెళ్తున్న టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా బాబును సోమలలో వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. రాళ్ల వర్షం కురిపించారు. నంజంపేట వద్ద టీడీపీ శ్రేణుల కార్ల అద్దాలు పగలగొట్టారు.
- పుంగనూరు నుంచి కుప్పం చంద్రబాబు ప్రోగ్రామ్‌కు భారీఎత్తున బయల్దేరాడని టీడీపీ నేత ఎస్‌కే రమణారెడ్డి ఇంటి స్థలం ప్రహరీ, షెడ్లను కూల్చేశారు. టీడీపీ కార్యకర్త హేమాద్రిని పుంగనూరులో కిడ్నాప్ చేసి అతని చేతిలో డ్రగ్స్ పెట్టి వీడియోలు తీసి, కేసుల్లో ఇరికించారు.
- చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 2023 అక్టోబరు 2న శ్రీకాకుళం జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్తలు కుప్పం వరకు సైకిల్‌యాత్ర చేపట్టారు. అదే నెల 20న యాత్ర పుంగనూరుకు చేరుకుంది. అక్కడి వైసీపీ నేత చెంగలాపురం సూరి దుర్భాషలాడుతూ సైకిళ్లపై టీడీపీ జెండాలు పీకేయించి, వారు ధరించిన పసుపు రంగు దుస్తుల్ని విప్పించి బూతులు తిట్టారు.
- 2023 జనవరి చివర్లో కుప్పం నుంచి మొదలైన లోకేశ్ యువగళం పాదయాత్రపై పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. ఉల్లంఘించారంటూ కేసులు నమోదు చేశారు. పైగా చిత్తూరు జిల్లాలో 6, తిరుపతి జిల్లాలో 9 చొప్పున కేసులు పెట్టారు. వీటిలో ఐదింటిలో నారా లోకేశ్ పేరును ఇరికించారు.

ఊరొదిలి పోయే ప్రమాదం తప్పింది



ఇంత దుర్మార్గమైన కాలాన్ని ఎవరూ ఎప్పుడూ చవిచూసి ఉండరు. టీడీపీలో యాక్టివ్‌గా ఉన్నాననే ఏకైక కారణంతో నాపై 18 అక్రమ కేసులు పెట్టారు.మా కుటుంబంలో 14 మంది ఉండగా.. మొత్తం 42 కేసులు పెట్టారు. నేను ఆరు నెలలు, కుటుంబ సభ్యులు 3 నెలలు అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చింది. లెక్కింపు రోజున చంద్రబాబుకు కౌంటింగ్ ఏజెంట్‌గా కేంద్రంలో ఉన్నా. ఒకటే ఆందోళన. ఒకవేళ రాష్ట్రంలో వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే కుటుంబంతో సహా బయటి ప్రాంతాలకు వెళ్లిపోదామనే అనుకున్నాం. అరాచకపాలన అంతమైంది అని ఫలితాలు చాటి చెప్పడంతో ఆనందం ఉప్పెనలా మారింది. ఇప్పుడు ప్రశాంతంగా జీవిస్తున్నాం.

- జయశంకర్, రామకుప్పం

వైసీపీ వెన్నుపోటు దినంపై అగ్గిలా...

ప్రజల దృష్టి మళ్లించడానికే జగన్ డ్రామాలు



తమ కుంభకోణాలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తుంటే వాటినుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్ డ్రామాలాడుతున్నారు. తొలి ఏడాది కనీసం పది శాతం హామీలనూ నెరవేర్చని జగన్ కూడా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదం. కన్న తల్లి, చెల్లెలితోపాటు అన్ని వర్గాలకూ జగన్ వెన్నుపోటు పొడిచారు. వెన్నుపోటు, గొడ్డలివేటు అనేవి జగన్‌రెడ్డి పేటెంట్లు. అరాచకాలు, అప్పులతో రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ నేడు అరచి గగ్గోలు పెట్టినా ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరు. ఇప్పటికైనా జగన్ దుష్ప్రచారాలను మానుకోకుంటే మరింత ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

- పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గొడ్డలిపోటు చరిత్ర జగన్‌దే



తన భుజాలపై మోసిన బాబాయిని గొడ్డలిపోటుతో చంపినవారిని కాపాడి రక్త సంబంధానికి.. తల్లిని, చెల్లిని ఇంటినుంచి తరిమేసి కుటుంబ వ్యవస్థకు.. మచ్చ తెచ్చిన జగన్ వెన్నుపోటు దినోత్సవం పేరిట రోడ్డెక్కడం దారుణం. వైసీపీని స్థాపించిన శివకుమార్‌ని వెన్నుపోటు పొడిచి పార్టీని లాగేసుకున్న జగన్‌రెడ్డి పరిపాలనను గమనించే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు.11సీట్లిచ్చి ఇంట్లో కూర్చోబెట్టారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేస్తే ఏడాదిలో కేవలం 10శాతం హామీలు మాత్రమే నెరవేర్చిన వైసీపీ ఇపుడు వెన్నుపోటు దినం పేరిట రోడ్డెక్కడం హాస్యాస్పదం.

- నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్

జగనే నిజమైన వెన్నుపోటుదారు



జూన్ 4వ తేదీ.. జగన్ రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి పొందిన రోజు.కూటమి ప్రభుత్వం అందిస్తున్న మంచి పరిపాలన చూసి ఓర్వలేక జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా ప్రకటించడం వైసీపీ నాయకులకు తగదు.నిజంగా జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే జూన్ నాలుగుకు గొడ్డలిపోటు దినంగా నామకరణం చేసుకోవాలి. ఆస్తులకోసం తల్లి,చెల్లిని గెంటేసిన జగన్‌రెడ్డి కూడా నీతులు చెబుతుంటే జనం నవ్వుతున్నారు. జగన్ పీడ విరగడై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం బంగారుపాళ్యంలో దీపాలు వెలిగించి వేడుక చేసుకుంటాం.

- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

11 సీట్లిచ్చినా బుద్ధి రాలేదా?



అసెంబ్లీ ఎన్నికల్లో 11సీట్లతో జనం శాస్తి చేసినా జగన్‌రెడ్డికి బుద్ధి రాలేదు.ఐదేళ్ల పాటు అరాచక పాలన చేయడమే కాక మూడు రాజధానుల పేరుతో ప్లేటు ఫిరాయించి వెన్నుపోటు పొడిచిందెవరు?జూన్ 4వతేదీకి వెన్నుపోటు దినం కాకుండా సొంత కుటుంబ సభ్యుల్ని పులివెందుల్లో గొడ్డలిపోటుతో వేసేసిన దినంగా, వైజాగ్ ఎయిర్‌పోర్టులో కోడికత్తి డ్రామా దినంగా, ఎన్నికల ప్రచారంలో గులకరాయితో ప్రజల సానుభూతికోసం నటించిన దినంగా, సీఎం పదవి ఇవ్వలేదని కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచిన దినంగా పెట్టుకోవాలి.కూటమి సంక్షేమ పాలనలో జూన్ నాలుగును అభివృద్ధి - సంక్షేమ దినంగా ప్రజలు పాటించి సంబరాలు చేసుకోవాలి.

- గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్

తోతాపురి టన్ను రూ.12 వేలు

మద్దతు ధర ప్రకటించిన కలెక్టర్



ఎమ్మెల్యేలు, రైతు సంఘాలు, మామిడి పరిశ్రమదారులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్, వర్చువల్ విధానంలో తిరుపతి నుండి పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులతో పాటు గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం తోతాపురి రకం టన్ను ధర రూ. 12 వేలుగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ఉత్పత్తి అవుతున్న తోతాపురి రకానికి గిట్టుబాటు ధర కోసం మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల్లో సమస్యల గురించి వాటి యాజమాన్య ప్రతినిధులు తెలియజేశారని చెప్పారు. రెండు వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టన్ను రూ.12వేలుగా నిర్ణయించడం జరిగిందని చెప్పారు. రైతుల కష్టాలను గుర్తించి, వారినుంచి మామిడి కొనుగోలు చేయాలని గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్ సూచించారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించే అంశంలో రైతులకే తొలిప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు.అయితే పరిశ్రమల మేలు కూడా అవసరమంటూ రెండు వర్గాలనూ సమావేశపరిచి చివరికీ ధరను కలెక్టర్ నిర్ణయించినట్లు చెప్పారు.పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ఇరువర్గాలూ పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.గుజ్జుపరిశ్రమల యాజమాన్య సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ మామిడి గుజ్జుకు డిమాండ్ తగ్గిందని ప్రాసెసింగ్ కంపెనీల్లో నిల్వలు పెరిగిపోయాయని వివరించారు.ఎల్డీఎం హరీష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,ఉద్యానశాఖ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్తూరు మండీలకు పోటెత్తిన కాయలు

- ఎగుమతులతో లాభసాటి ధరలు



గుజరాత్ వ్యాపారితో ధరలపై మాట్లాడుతున్న ఏడీ పరమేశ్వరన్

చిత్తూరు సెంట్రల్,జూన్3(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మండీలకు మంగళవారం మామిడి కాయలు పోటెత్తాయి. గత వారం మొదట్లో రోజుకు కేవలం 4-10 టన్నుల మధ్య కాయలు వచ్చాయి. సోమవారం 200 టన్నులు రాగా, మంగళవారం 275టన్నుల దాకా వచ్చాయి.కాయలు నాణ్యంగా ఉండడంతో మంగళవారం గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు మామిడి ఎగుమతి చేశారు.మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ మండీకి వచ్చిన మామిడి రకాలను,నాణ్యతను పరిశీలించారు. మండీల యజమానులు, ఎగుమతిదారులతో ధరలపై చర్చించారు. రైతులకు లాభసాటి ధరలు వచ్చేలా చర్యలు చేపట్టారు. వర్షాలు ఆలస్యం కావడం మామిడి రైతులకు అనుకూలంగా మారింది. ఈదురుగాలులతో రాలిన కాయలతో నష్టం వాటిల్లినా, కూలీల సాయంతో కోసిన మామిడికి ధర బాగానే పలికింది. బంగారుపాళ్యం మండీలకు మంగళవారం 50 టన్నుల వరకు మామిడి రాగా, వచ్చే వారంలో అధికంగా వస్తుందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

చిత్తూరు మండీలో మామిడి ధరలు

రకం	టన్ను ధర (రూ.వేలల్లో)
బేనీషా	18-25
తోతాపురి	8(పచ్చి కాయలు)-13(దోర కాయలు)
పుల్లూర	8-10
మల్లిక	30-40
ఇమాంపసంద్	60-75
కాలేపాడ్	30-40

కోతల మామిడికి ధర బాగుంది

కూలీల సాయంతో చెట్ల నుంచి కోసిన కాయలకు ధర అధికంగా పలికింది. కాయలు బరువుగా, నాణ్యంగా వుండడంతో ధర వచ్చింది. రాలిన కాయలు, దోటితో కోసిన కాయలు దెబ్బతిని, పురుగుపట్టడంతో ధర పలకడం లేదు. కోతల్లో జాగ్రత్తలు పాటించి మండీలకు తెస్తే గిరాకీ బాగుంది.

- కృష్ణమూర్తి నాయుడు, మండీ యజమాని

చిన్నశేషవాహనంపై గోవిందుడి చిద్విలాసం





తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఉదయం ఉత్సవర్లు చిన్నశేష, రాత్రి హంస వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవ ముందు కళాకారుల బృందాల కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ నయనానందకరంగా సాగింది. ఈ కార్యక్రమంలో జియ్యంగార్లు, డిప్యూటీఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఏవీఎస్వో మోహన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' లో నటిస్తున్నా


● హీరో కార్తీక్ రాజు



'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' అనే సినిమాలో నటిస్తున్నట్టు హీరో కార్తీక్ రాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమా విడుదలకు ముందు శ్రీవారిని దర్శించుకున్న తనకు మళ్లీ ఇన్నాళ్లకు దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. మరో రెండు ప్రాజెక్టులనూ తాను చేస్తున్నట్టు వెల్లడించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.89 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,418

తలనీలాలు సమర్పించినవారు: 34,900

● విస్తరిస్తున్న టాటా ట్రస్ట్ సేవలు

● స్వీకార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణ

తిరుపతిలో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

శ్రీవారి పాదాల చెంత టాటా ట్రస్టు ఎంతో సమున్నత ఆశయంతో క్యాన్సర్ ఆస్పత్రిని నెలకొల్పింది. మూడేళ్లు పూర్తి చేసుకుంది. లాభాపేక్ష లేకుండా ఆస్పత్రి నడపాలన్నదే టాటా ట్రస్టు ఉద్దేశ్యం. ఆ దిశగా కృషి చేస్తున్నాం.





అలిపిరి నుంచి జూపార్క్‌కి వెళ్లే దారిలో పచ్చని వాతావరణంలో స్వీకార్ (శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్) ఉంది. టీటీడీ ఈ స్థలాన్ని టాటా సంస్థకు కేటాయించింది. 2018 ఆగస్టు 31న రతన్ టాటాతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ సంస్థకు భూమిపూజ చేశారు. సుమారు రూ200 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో మూడేళ్లుగా క్యాన్సర్ ఆస్పత్రి నడుస్తోంది. ఈ ఆసుపత్రి అందిస్తున్న సేవల గురించి, ఇక్కడ ఉన్న ఆధునిక సాంకేతిక వైద్య పరికరాల గురించీ స్వీకార్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి జరిపిన సంభాషణలోని ముఖ్యాంశాలు ఇవి..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అత్యాధునిక పరికరంతో రేడియో థెరపీ

టాటా ట్రస్టుపై ఉన్న నమ్మకంతో రోగులు ఎక్కడెక్కడ నుంచో వెతుక్కుంటూ ఆస్పత్రి కి వస్తున్నారు. ప్రారంభంలో రోజుకు 30 మంది వచ్చేవారు. ఇప్పుడా సంఖ్య 350కి చేరుకుంది. ఆసియాలోనే అధునాతన లీనియర్ యాక్సిలరేటర్ టాటా ఆస్పత్రిలో ఉంది. ఏపీలో ఏ ఆస్పత్రిలో ఇటువంటిది లేదు. రూ. 20 కోట్లు విలువ చేసే ఈ పరికరం ద్వారా రేడియో థెరపీ అందిస్తున్నారు. 2ఎంఎం ఉండే చిన్న చిన్న బ్రెయిన్ ట్యూమర్స్‌ను కూడా ఈ పరికరం ద్వారా కరిగించేవీలుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.





90 శాతం ఉచితమే : స్వీకార్‌లో 80 శాతం ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్ రోగులే ఉంటారు. మరో 10 శాతం మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారానూ, దాతల సహకారంతోనూ చికిత్స అందిస్తున్నాం. అనంతపురం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలనుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక నుంచి కూడా పేషెంట్లు వస్తున్నారు. నెలకు 150 సర్జరీలు, 1200 కీమో థెరపీలు, 80 రేడియో థెరపీలు చేస్తున్నాం. మా సంస్థలో పెట్‌సిటీ సౌకర్యం ఉంది. నోటిద్వారా వచ్చే క్యాన్సర్లు, రొమ్ము, ఓవరీ, కడుపు, ఊపిరితిత్తులు క్యాన్సర్లతో ఇక్కడికి ఎక్కువమంది వస్తున్నారు. ప్రస్తుతం బ్రెయిన్ ట్యూమర్స్‌కు చికిత్స, ట్రాన్స్‌ప్లాంటేషన్ స్వీకార్‌లో చేయడంలేదు. పిల్లలకు క్యాన్సర్ చికిత్స త్వరలో అందుబాటులోకి రానుంది. బ్లడ్ క్యాన్సర్ కేసులు కూడా ఇప్పుడు చూస్తున్నాం.

స్వీకార్ డైరెక్టర్ మన తిరుపతివాసి డాక్టర్ ప్రశాంత్

ప్రతిష్టాత్మకమైన స్వీకార్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌ది తిరుపతి. మూడో తరగతి వరకు తిరుపతిలో, ఆతర్వాత 10వరకు ఊటీ బోర్డింగ్ స్కూల్‌లో చదివారు. నెల్లూరు నారాయణలో ఇంటర్ అయ్యాక మంగళూరులోని కస్తూర్బ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేశారు. వైజాగ్‌లోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంఎస్ పూర్తిచేశారు. ముంబైలోని టాటా మెమోరియల్ ఆస్పత్రిలో ఎంసీహెచ్ (సర్జికల్ ఆంకాలజీ) చేసిన డాక్టర్ ప్రశాంత్.. న్యూయార్క్‌లో రొబోటిక్ థొరాసిక్ సర్జరీపై శిక్షణ తీసుకున్నారు. పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో పదేళ్లపాటు సర్జికల్ ఆంకాలజిస్ట్‌గా పనిచేశారు. థొరాసిక్ సర్జరీ, హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ, పెరిటోనియల్ సర్ఫేస్ మాలిగ్నన్సీల్లో ప్రత్యేక నిపుణుడుగా డాక్టర్ ప్రశాంత్‌కు పేరుంది. ఈయన తల్లి సులోచనమ్మ తిరుపతిలో వేలాది మందిని నర్సులుగా తయారు చేసిన విద్యావేత్త. సోదరుడు ప్రవీణ్ ఎడిపై స్కూలు నడుపుతున్నారు. భార్య డాక్టర్ లక్ష్మీసంధ్య, స్వీకార్‌లోనే మెడికల్ ఆంకాలజీ విభాగంలో పనిచేస్తున్నారు.





అత్యాధునిక ఎమ్మారై పరికరం - మామోగ్రఫీ పరికరం

క్యాన్సర్ గుర్తించేందుకు క్యాంపులు

60 నుంచి 70 శాతం మంది కేన్సర్ 3 లేదా 4వ స్టేజ్‌లో వస్తున్నారు. ఇంకా ముందే గుర్తిస్తే చికిత్సకు వీలవుతుంది. అందుకే స్క్రీనింగ్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాం. రోగుల వద్దకే వెళ్లి పరీక్ష చేస్తున్నాం. లక్షణాలుంటే ఆస్పత్రికి రెఫర్ చేస్తాం. ఇప్పటివరకు 805 క్యాంపులు నిర్వహించాం. వీటి ద్వారా 50వేల మంది రోగులను పరీక్షించగా 468మందిలో కేన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించాం. వారిలో 42 మందికి నిర్ధారించి, 40మందికి చికిత్స అందించాం.

లుకేమియాకీ చికిత్స

అధునాతన పద్ధతులతో కీహోల్ లంగ్ ఆపరేషన్లు, హైప్యాక్, బైప్యాక్ ప్రొసీజర్లు, ఐసీయూ, క్రిటికల్ కేర్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీలు, కాలు నుంచి ఎముక తీసి ముఖానికి పెట్టడం వంటివి స్వీకార్‌లో చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి ఇమ్యునోథెరపీ కూడా ప్రారంభించాం. బ్రెయిన్‌లో ఎక్కడ క్యాన్సర్ గడ్డ ఉందో అక్కడే రేడియేషన్ (ఫోకస్డ్ రేడియేషన్)ఇచ్చే విధానం ఉంది. నాలుగు నెలలుగా లుకేమియాకు వైద్యం ప్రారంభించాం. అక్యూట్ క్యాన్సర్ వాళ్లకు అవసరమైన డయాలసిస్ యూనిట్‌ను కూడా ప్రారంభించాం. మరీ ముఖ్యంగా పాలేటివ్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. చివరి దశలో ఉన్న రోగులకు పాలేటివ్ కేర్‌లో అంకితభావంతో పనిచేసే సిబ్బంది మా సంస్థలో ఉన్నారు.



"వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స ఇచ్చేదానికన్నా ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడంతో చాలావరకు కేన్సర్‌ను నిరోధించవచ్చు. పింక్ బస్సు మెడికల్ మొబైల్ యూనిట్ ద్వారా ఆ పనిచేస్తున్నాం.ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ఇందువల్ల మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధిని గుర్తించి తొలిదశలోనే చికిత్స అందించగలుగుతున్నాం."

రూ.4,500లుకే క్యాన్సర్ వ్యాక్సిన్

స్వీకార్‌లో సర్వైకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. 9 నుంచి 14 ఏళ్ల వరకు పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడానికి సరైన వయసు. మగవాళ్లు కూడా ఈవ్యాక్సిన్ వేసుకోవచ్చు. వారికి అనస్, నోటి క్యాన్సర్లు నిరోధించవచ్చు. పెళ్లికి ముందు 30 ఏళ్ల దాకా కూడా వేసుకోవచ్చు అమ్మాయిలు 3 డోసులు, అబ్బాయిలు 2 డోసులు వేసుకోవాల్సి ఉంటుంది. ఒక డోసు ఖరీదు రూ4.5వేలు. కార్పొరేట్ ఆస్పత్రుల్లోకన్నా తక్కువ. ప్రజల్లో అవగాహన పెరగడం వలన సర్వైకల్ క్యాన్సర్ కేసులు గత పదేళ్లతో పోలిస్తే చాలా తగ్గుతున్నాయి.

చెరువులో దిగి గల్లంతైన పాడి రైతు



చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసనమాల గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు (55) పశువుల కోసం చెరువులో దిగి గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు భార్య మాధవితో కలసి పశువులను మేపేందుకు చెరువుకట్టపైకి వెళ్లారు. సాయంత్రం పశువులను ఇంటికి తీసుకొస్తుండగా ఆవుదూడ చెరువులోకి దిగింది. దూడను గట్టుమీదకు తీసుకొచ్చేందుకు శ్రీనివాసులు చెరువులోకి దిగాడు. ఆవుదూడ కాస్త లోతులోకి వెళ్లడంతో శ్రీనివాసులు ముందుకెళ్లి భార్య మాధవి కళ్లెదుటే నీటమునిగి గల్లంతయ్యాడు. చెరువు నీటిలో మునిగిపోయిన భర్త బయటకు రాకపోడంతో మాధవి కేకలు వేస్తూ గ్రామానికి చేరుకుని బంధువులకు తెలిపింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఎస్ఐ నాగరాజు, వీఆర్వో భూధనం రమేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరితో పాటు అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని శ్రీనివాసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం కనిపించకపోవడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

యోగాంధ్రలో భాగస్వాములు కండి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో బుధవారం ఉదయం జరిగే యోగాంధ్రలో భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం పిలుపునిచ్చారు. యోగా కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజాప్రతినిదులు, ప్రజలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు 2వేల మందికి పైగా పాల్గొంటారన్నారు. అందుకు సంబంధించిన మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు.

65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే రేషన్

65 సంవత్సరాలు నిండిన వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులను ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వారు రేషన్ దుకాణానికి రావాల్సిన అవసరం లేదని డీలర్లే ఇంటి వద్దకు తెచ్చిస్తారన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు వద్దన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలు రీఓపెన్‌కు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మీ ఇళ్లను కూడా ఇలాగే ఉంచుకుంటారా...?

● ఆర్టీసీ పారిశుధ్య కార్మికులను మందలించిన జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



కోట ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్య కార్మికులను ప్రశ్నిస్తున్న జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది ప్రయాణీకులు వచ్చే ఆర్టీసీ బస్టాండ్ ఇలానేనా ఉండాల్సింది... ఇక్కడ ఎటుచూసినా చెత్త కనిపిస్తుంది... ఇలా ఉంటే ప్రయాణీకులకు రోగాలు రావా... ఇక్కడ కార్మికులు ఎవరో పిలిపించండంటూ ఆ సంస్థ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోట ఆర్టీసీ బస్టాండ్‌లో బీజేపీ నాయకులు, ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన గంట పాటు తనిఖీలు చేశారు. బస్టాండ్‌లోకి రాగానే ప్రాంగణం అంతా చెత్తాచెదారంతో నిండి ఉండటం, మరోపక్క నక్కలోళ్లు ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పడేయటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాకాడు ఆర్టీసీ డీఎం చిన్నపెంచలయ్యను పిలిపించి ఆర్టీసీ ప్రాంగణంలో నక్కలోళ్లను బయటకుపంపి శుభ్రం చేయించాలని కోరారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారికి ఫోన్‌చేసి నక్కలోళ్లను వెంటనే బయటకుపంపాలని కోరారు. మహిళల మరుగుదొడ్లకు గోడలపైన రేకులు లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి మీ ఇళ్లల్లో ఆడవాళ్లను ఇలాగే చూసుకుంటారా అని అక్కడ మరుగుదొడ్లను శుభ్రంచేసే కార్మికులను ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే కాంట్రాక్టర్ అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఎలాంటి వ్యర్థాలు వేయకూడదని, ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ డిపోల్లో 3వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కొత్తగా 950 బస్సులు కొనుగోలు చేసి, వాకాడు డిపోకు 14 బస్సులు ఇస్తామన్నారు. అన్ని డిపోలలో ఎలక్ట్రిక్ బస్సులు నడపనున్నట్లు సురేష్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వర రావు, నాయకులు గిరిధర్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, అంబరీషా, ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.

వెన్నుపోటు దినం ఎందుకు?

● వైసీపీ నేతలకు చంద్రగిరి ఎమ్మెల్యే సూటి ప్రశ్న ● సైకో పాలన విముక్తికి ఏడాది పూర్తయిందన్న నాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రజలకు జూన్ 4వ తేది పండుగ రోజు. కానీ వైసీపీ వారు మాత్రం వెన్నుపోటు దినమని చెబుతున్నారు. వెన్నుపోటు దినం ఎందుకు? ఐదేళ్ల వైసీపీ పాలనలో హౌసింగ్ పేరుతో తూతుమంత్రంగా స్థలాలు చూపి ఇల్లు కట్టనందుకా? ఒకేసారి పింఛను పెంచకుండా మోసం చేసినందుకా? ప్రజలకు మీరిచ్చిన హామీలను నెరవేర్చనందుకా? తల్లిని, చెల్లిని బయటకు పంపినందుకా? మద్యనిషేధం, మెగా డీఎస్సీ చేయకుండా చేసినందుకా? బీసీ,ఎస్సీ ఎస్టీ,మైనార్టీ నిధులు మళ్లించినందుకా? బాబాయిని గొడ్డలి వేటుతో నరికినందుకా? ఎందుకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నారు' అని వైసీపీని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి కబంధహస్తాల నుంచి.. సైకో పాలన నుంచి నేడు ప్రజలకు విముక్తి కలిగిన రోజు జూన్ నాలుగో తేది అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. దీనికి ఏడాది పూర్తయినట్లు తెలిపారు. ప్రజలు 11 సీట్లతో తీర్పు ఇచ్చినా వైసీపీనాయకుల్లో మార్పు రాలేదన్నారు. వెన్నుపోటు దినం పేరుతో ఘర్షణ వాతావరణం సృష్టించాలన్నదే వైసీపీ ప్లాన్ అన్నారు.సూపర్‌సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయలో జరిగిన దాడి, తుడాలో అవకతవకలపై మీడియా వారు ప్రశ్నించగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సమాధానం చెప్పారు. యోగాడేను బుధవారం ఉదయం చంద్రగిరి కోట వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'గొడ్డలి పోటు' దినం నిర్వహించండి

తిరుపతి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ వెన్నుపోటు కాకుండా గొడ్డలిపోటు దినోత్సవంగా నిర్వహిస్తే బాగుండేదని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని లూటీ చేసిన వైసీపీ ఎన్డీఏ కూటమి పాలనను విమర్శించే అర్హత లేదన్నారు. వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలికి.. ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైన సందర్భంగా బుధవారం పండుగలా వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటలకు తిరుపతి నగరం ఎస్టీవీ నగర్‌లో ముగ్గులపోటీ, సాయంత్రం ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయం వద్ద దీపాలు వెలిగించడంతో పాటు టపాకాయలు కాల్చనున్నట్లు చెప్పారు.

వెన్నుపోట్లతా జగన్ కుంటుంబంలోనే..

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోట్ల చరిత్ర చూసుకుంటే జగన్ ఇంట్లోనే ఉన్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మంగళవారం అన్నారు. మంగంపేట మైన్స్ హత్యల నుంచి పీవీ నరసింహరావు మీద చెప్పులు విసిరే దాక, ఆస్తుల కోసం చెల్లెలిని వదిలేసిన విధానం, వివేకానందరెడ్డి హత్య.. ఇలా వెన్నుపోట్లతోనే నిండి ఉందన్నారు.

పది మంది టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

తిరుపతి, జూన్3(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన పది మంది టీడీపీ నేతలపై నమోదైన ఎన్నికల ఉల్లంఘన కేసును అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంగళవారం కొట్టివేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో ప్రచారానికి అధికారుల వద్ద ముందస్తు అనుమతి తీసుకోలేదని తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ ఛైర్మన్ మన్నూరు సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, బి.జి. కృష్ణ యాదవ్, డాక్టర్ సుధారాణి, పుష్పావతి, డాక్టర్ ఆశాలతపై కేసు నమోదైంది. సుదీర్ఘ విచారణ అనంతరం వీరిని నిర్దోషులుగా నిర్ధారించి కేసు కొట్టివేశారు. ఈ కేసును టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ దినకర్, సత్యశ్రీవాసన్ వాదించారు.







అమ్మవారికి పూజలు చేసిన శ్రీలంక రాజకుటుంబీకులు - అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జగన్మోహన్, టీడీపీ నేత చంద్రప్రకాష్, నాయకులు

బీఎన్‌ఆర్ పేటలో గంగమ్మ జాతర

తొలిపూజ చేసిన శ్రీలంక రాజ కుటుంబీకులు

చిత్తూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్ పేటలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది.తొలిపూజను శ్రీలంక రాజ కుటుంబీకులు చేశారు. అప్పట్లో శ్రీలంకకు చెందిన రాజకుటుంబీకులు ఈ ప్రాంతాన్ని పాలించారు. అందువల్ల వారే తొలిపూజలు చేసి, జాతరను ప్రారంభిస్తారు. కొన్ని దశాబ్దాలుగా ఈ ఆనవాయితీ నడుస్తోంది. ప్రస్తుతం ఈ కుటుంబీకులు బెంగళూరులో స్థిరపడ్డారు. ఏటా వారు కుటుంబ సమేతంగా జాతరకు వచ్చి పూజలు చేసి వెళ్తుంటారు. మంగళవారం జరిగిన పూజల్లో రాజ కుటుంబీకులు విక్రమరాజ సింహ, సుక్కు రాజసింహ, సత్యనంద రాజ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో..

టీడీపీ సీనియర్ నేత చంద్రప్రకాష్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గీర్వాణి దంపతుల స్వగ్రామం కూడా కావడంతో ప్రతి ఏడాది వారి ఆధ్వర్యంలో జాతరను వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. భారీ బైక్, కార్ల ర్యాలీ, బాణాసంచా నడుమ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను ఆహ్వానించి.. అమ్మవారి దర్శనం కల్పించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, నాయకులు సురేంద్రకుమార్, మోహన్‌రాజ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శోభాయమానంగా వరదుడి రథోత్సవం







రథంపై బొరుగులు చల్లుతున్న భక్తులు



ఊరేగింపుగా వస్తున్న ఉభయదారులు

రథోత్సవంలో పాల్గొన్న భక్తజన సందోహం (ఇన్‌సెట్లో) ఉభయ దేవేరులతో స్వామివారు

యాదమరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యాదమరిలో వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని మంగళవారం శోభాయమానంగా నిర్వహించారు. రథంపై మహావిష్ణువు అలంకరణలో ఉభయ దేవేరులతో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు వరదా.. వరదా.. అంటూ నినదిస్తుండగా రథోత్సవం సాగింది. రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. అలాగే రథంపై బొరుగులు, పువ్వులు చల్లి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు అయ్యప్ప ఆలయ కమిటీ, గ్రామస్తులు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి మెట్ల తేరోత్సవం, రాత్రి తోట ఉత్సవం నిర్వహించారు. కాగా, బుధవారం ఉదయం వెన్నత్తాయ్ కణ్ణన్ తిరుక్కోళం, రాత్రి అశ్వావాహన సేవ జరగనుంది.

చాలీచాలని విత్తనాలు

● నేటినుంచి శనక్కాయల పంపిణీ

● తొలి రెండ్రోజుల్లో రిజిస్ట్రేషన్లు



యాదమరి మండలంలోని రైతు సేవా కేంద్రానికి చేరిన వేరుశనగ విత్తన కాయలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనకాయల పంపిణీకి సమయం ఆసన్నమైంది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు అవసరమైనన్ని విత్తనాలు రాకపోయినా, వచ్చిన వాటినే పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ సిద్ధమైంది. వాస్తవానికి అదునుకు పక్షం రోజులు ముందు అంటే మే 15 నుంచి ఇవ్వాల్సి ఉండగా, 20 రోజులు ఆలస్యంగా పంపిణీ చేయనున్నారు. బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా 502 రైతు సేవా కేంద్రాల్లో విత్తన కాయలను పంపిణీ చేయనున్నారు.ఇందుకోసం సిద్ధం చేసిన యాప్‌ను ఎలా ఉపయోగించాలన్న దానిపై రైతు సేవా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచనలు చేశారు.ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 88,095 ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగు చేయనున్నారు. ఇందుకోసం 35వేల నుంచి 40వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, 25,643 క్వింటాళ్లు (కే-6 రకం 25,038 క్వింటాళ్లు, నారాయణి రకం 605 క్వింటాళ్లు) మాత్రమే జిల్లాకు చేరాయి. క్వింటాలు ధర రూ.9,300 ఉండగా, రాయితీ రూ.3,720 పోనూ రైతు వాటా కింద రూ.5,580 చెల్లించాల్సి ఉంది. కే6 రకం సబ్సిడీ పోను 30 కిలోల బస్తా రూ.1,674 ఉండగా, నారాయణి రూ.1.710, లేపాక్షి రూ.1,476గా ధరలు నిర్ణయించారు.బుధ, గురువారాల్లో విత్తన కాయలు అవసరమైన రైతులు రిజిస్ట్రేషను చేసుకోవాల్సివుంది. రైతు సేవా కేంద్రాల్లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీ, ఆధార్‌కార్డు, అవసరమైన విత్తనాలు, వాటి రకం, ధర తదితర వివరాలు నమోదు చేసి, టోకెన్ ఇవ్వనున్నారు. నిర్ణయించిన మొత్తం చెల్లించాక శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో రైతులకు ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా విత్తనాలు అందజేయనున్నారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా నేడు 'అమాస' బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా బుధవారం ఉదయం 11 - 12 గంటల మధ్య మరోమారు అమాస రాజశేఖర రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈ సందర్భంగా బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు తదితరుల కటౌట్లు ఏర్పాటు చేశారు.టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రముఖులందరికీ ఆహ్వానాలు పంపారు.ఈనెల 26వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత ఏడుగురు డైరెక్టర్లతో కూడిన పాలకవర్గం రానుంది.నిజానికి డీసీసీబీతో అమాస రాజశేఖర రెడ్డికి సుదీర్ఘమైన అనుబంధముంది. 2006లో జరిగిన ఎన్నికల్లో గెలుపొంది 2011 వరకు, 2011 నుంచి 2016 వరకు మరోసారి ఎన్నికై పదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆయన పాలకవర్గాన్ని మరో మూడేళ్లపాటు కొనసాగించింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో పాలకవర్గం రద్దయింది. ప్రస్తుతం జేసీ విద్యాధరి బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

టీచర్లకు ప్రత్యేక శిక్షణ ప్రారంభం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష (ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో హెచ్ఎం, ఎస్ఏలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. టీచర్లు వారి బోధన విధానాల్లో కొత్త పద్ధతులు పాటించాలని సూచించారు. మూడ్రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అకడమిక్ క్యాలెండర్, విద్యార్థులకు స్వయం మూల్యాంకనం విధానం, టీచర్ల హ్యాండ్‌బుక్స్, లీప్ యాప్ వినియోగంపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌సీఈఆర్‌టీ, డైట్ పరిశీలకులు నరసింహులు, మోహన్‌రెడ్డి, ఎంఈవో1,2 సెల్వరాజ్, మోహన్, హెచ్ఎంలు, ఎస్ఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న చెంగల్రాయనాయుడు

చిత్తూరు క్రీడలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని మెసానికల్ మైదానంలో బుధ, గురువారాల్లో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ అండర్-23 మహిళలు, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. చిత్తూరు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మిట్టూరులోని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు మీడియాకు వివరాలు తెలిపారు. విజేతలైన జట్లు కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో ఈనెల 12వ తేదీనుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలను అమరరాజా సంస్థకు చెందిన రాజన్న ట్రస్ట్ కల్పిస్తుందని తెలిపారు. పోటీలను బుధవారం సాయంత్రం ఐదు గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చక్రవర్తి పాల్గొన్నారు.

బోనమందలో ఏనుగుల స్వైరవిహారం

● మామిడి పంటల ధ్వంసం

సోమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల సంచారంతో రైతులు భారీగా పంటలను కోల్పోతున్నారు. సోమవారం రాత్రి పేటూరు పంచాయతీ బోనమంద వద్ద ఏనుగులు మామిడి, టమోటా తోటల్లో స్వైర్యవిహారం చేసి పంటలను ధ్వంసం చేశాయి. ఏనుగుల మందలోని 14 ఏనుగులు ఇర్లపల్లె సమీపంలోని కనికల చెరువు వద్ద పగలు మకాం వేసి రాత్రి బోనమంద, పేటూరు సమీపంలో మూడు ఎకరాల టమోటా పొలంలో సంచరించి పంటను, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. రైతులు బాలాజీనాయుడు, విజయలకుచెందిన మామిడి చెట్లను విరిచేశాయి. ఆరుగాలం కష్టపడి పంటలు పండించి చేతికి అందే సమయంలో ఏనుగుల దాడులతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్

● బాధితురాలికి 25 గ్రాముల బంగారు చైన్ అప్పగింత



చైన్‌ను మునిలక్ష్మికి అందజేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ కానిస్టేబుల్ తన నిజాయితీని చాటుకున్నాడు. దారిలో దొరికిన బంగారు చైన్‌ను బాధితురాలికి అప్పగించారు. ఈనెల రెండో తేదీన గుడిపాల మండలం 190 రామాపురానికి చెందిన మునిలక్ష్మి.. షర్మన్ పాఠశాల ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంకుకు వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికెళ్లే సమయంలో రూ.2.50లక్షల విలువైన 25 గ్రాముల బంగారు చైన్‌ను బ్యాంకు బయట బ్యాగులో పెట్టబోయి కింద వదిలేసి ఇంటికి వెళ్లిపోయారు. ఆ దారిలో వచ్చిన ఎస్పీ బంగ్లాలో పని చేసే కానిస్టేబుల్ అన్వర్ బాషకు ఈ చైను కనిపించింది. దాన్ని తీసుకుని నేరుగా ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఎవరైనా ఫిర్యాదు చేశారా అని తెలుసుకుని అధికారుల ఆదేశాలతో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఈ చైన్‌ను మునిలక్ష్మి జారవిడుచుకున్నట్లు గుర్తించారు. మంగళవారం ఆమెకు ఎస్పీ మణికంఠ ద్వారా బంగారు చైనును అప్పగించారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ మంగళవారం జిల్లా పరిషత్‌లోని మీటింగ్ హాలులో జరిగింది. 120 మందికి బదిలీల కౌన్సెలింగ్‌ను డీపీవో సుధాకర్ రావు నిర్వహించారు.

ఆర్‌డీఎస్ఎస్‌పై నిర్లక్ష్యం ఎందుకు?

అధికారులపై ఎస్ఈ ఆగ్రహం

చిత్తూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ ఇవ్వాలని ఉద్దేశంతో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టింది. అయితే అధికారులు నిర్లక్ష్యం వల్ల జిల్లాలో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి' అంటూ విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక గిరింపేటలోని తన కార్యాలయంలో ఆర్‌డీఎస్ఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పనితీరు మార్చుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేసి ఇవ్వడంలోనూ ఆలస్యం చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఇకపై అలా జరగకూడదని 24 గంటల్లో మరమ్మతులు లేదా వేరే ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతంగా నిర్వహిద్దాం

● అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహిద్దామని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం సాయంత్రం జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి యోగాంధ్ర కార్యక్రమంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలివిడతగా జిల్లాలో నాలుగు కేంద్రాల్లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాలు భారీఎత్తున విజయవంతంగా నిర్వహించామని ప్రకటించారు. ప్రతి సచివాలయ పరిధిలో యోగా కార్యక్రమాల నిర్వహణకు మూడు లేదా నాలుగు అనువైన ప్రాంతాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు గుర్తించాలని చెప్పారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో 3-5 రోజులపాటు ప్రతి బ్యాచ్‌కి 50 మంది చొప్పున సీనియర్ సిటిజన్లతోపాటు డ్వాక్రా మహిళలు, స్కూల్ పిల్లలకు యోగా శిక్షణ ఇప్పించాలన్నారు. ఇందుకోసం ప్రతి సచివాలయానికి ఒక పీఈటీని అధికారిగా నియమించాలని ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది లక్షల మందికి యోగా శిక్షణ అందించి, వారికి సర్టిఫికెట్లు అందిస్తామని తెలియజేశారు. డీఎల్డీవో రవికుమార్, వివిధ సంక్షేమశాఖల డీడీలు చెన్నయ్య, రబ్బాని బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏ ఒక్క టీచర్‌కూ అన్యాయం జరగకూడదు

ఆర్జేడీ శామ్యూల్



శామ్యూల్‌కు సమస్యలు తెలియజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా ఏ ఒక్క టీచర్‌కూ అన్యాయం జరగకూడదని విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. జిల్లాలో టీచర్ల ఖాళీల ప్రక్రియ పరిశీలన నిమిత్తం జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ, ఎస్జీటీల ఖాళీల ప్రక్రియను పరిశీలించారు. పొరబాట్లతో ఏ ఒక్క టీచర్ కూడా నష్టపోకుండా ఉండాలని సాంకేతిక విభాగం నిపుణులకు సూచనలు చేశారు. ఇందులో ఎంఈవోలు కీలకపాత్ర పోషించాలని ఎక్కడైనా తేడాలు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ ప్రక్రియలో భాగంగా ఖాళీల గణాంకాలు మంగళవారానికి కొలిక్కి వచ్చాయి. బదిలీలకు 4,800 మంది స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోగా, 2,512 మంది కచ్చితంగా బదిలీ కావాల్సిన వారున్నారు. 2,510 ఖాళీలను అధికారులు గుర్తించారు. అదేవిధంగా బదిలీలకు 3,412 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు దరఖాస్తు చేసుకోగా, 2,300 మంది కచ్చితంగా బదిలీ కావాల్సిన వారున్నారు. 3,999 ఖాళీలను అధికారులు గుర్తించారు.

ఆర్జేడీ దృష్టికి సమస్యలు

ఆర్జేడీ దృష్టికి ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్, మోహన్‌యాదవ్ తదితరులు మంగళవారం పలు సమస్యలు తీసుకెళ్లారు. వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి తక్కువ సమయం ఉందని, సీనియారిటీ, ఖాళీల జాబితాలు ఆలస్యం అవుతున్నందున టీచర్లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మిగులుగా చూపుతున్న ఎస్ఏలకు తగిన న్యాయం చేయాలని, డీఎస్సీ 2008 టీచర్లకు కామన్ సీనియారిటీ పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఖాళీలుగా ఏర్పడిన ఎంఈవో స్థానాల్లో తక్షణం ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించాలని కోరారు. దీనిపై ఆర్జేడీ స్పందిస్తూ ఏ ఒక్క టీచర్‌కూ నష్టం జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

వచ్చారు.. వెళ్లారు.!

● చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని పరిశీలించిన డీఎస్‌హెచ్ బృందం

● వైద్యులు, సిబ్బందిలో అసంతృప్తి



అపోలో ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్‌హెచ్ జాయింట్ కమిషనర్ రమేష్‌నాథ్

చిత్తూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని మంగళవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీఎస్‌హెచ్) జాయింట్ కమిషనర్ రమేష్ నాథ్ బృందం పరిశీలించింది. వార్డు, బ్లడ్‌బ్యాంకు, స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అపోలో ఎంవోయూ ప్రకారం ఉందా లేదా అని పరిశీలించి.. అక్కడున్న వైద్య సిబ్బందితో ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం అపోలో, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో సమావేశం నిర్వహించి, సూచనలిచ్చారు. అయితే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని అపోలోకే పూర్తిగా ఇచ్చేస్తారని.. వైద్యులు, సిబ్బందిని మరో ఆస్పత్రికి బదిలీ చేస్తారని ప్రచారం జరిగింది. అలాగే స్టాఫ్‌నర్సులు, ఇతర వైద్య సిబ్బంది కొరత ఉండటంతో పనిభారం పడుతోంది. వీటిపై ఎటువంటి చర్చా జరగకపోవడంతో వైద్యులు, సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, ఆర్ఎంవో సంధ్య, అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏవో రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు

టీడీపీ నాయకురాలు దుర్గ మృతిపై ఆమె తండ్రి, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి సంరక్షణ పోరాట కమిటీ కోఆర్డినేటర్ షణ్ముగం, సభ్యులు కలిసి జాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో వైద్యం సక్రమంగా లేదని, తన కుమార్తె మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

చిత్తూరు కోర్టుకు కుప్పం టీడీపీ నేతలు



చిత్తూరు కోర్టు వద్ద కుప్పం టీడీపీ నాయకులు

చిత్తూరు లీగల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు పెట్టిన కేసుల కారణంగా కుప్పం టీడీపీ నాయకులు మంగళవారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. 2023 ఆగస్టు 25వ తేదీన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు రామకుప్పం మండలం కొంగనపల్లె పంచాయతీ కొల్లుపల్లె వద్దకొచ్చినప్పుడు రెండు పార్టీల మధ్య జరిగిన గొడవపై అప్పట్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ పి.మనోహర్, రామకుప్పం మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, విశ్వనాథ్ నాయుడు, కుప్పం ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, టీటీడీ మెంబర్ శాంతారామ్, రామకుప్పం మాజీ జడ్పీటీసీ మునస్వామితోపాటు మరో 25మందిపై రామకుప్పం పోలీసులు కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. వీరంతా 29 రోజులు చిత్తూరు సబ్‌జైలులో ఉండి, బెయిల్‌పై విడుదలయ్యారు. కుప్పం కోర్టు ఈ కేసును చిత్తూరు జిల్లా కోర్టుకు మార్చగా వీరంతా మంగళవారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక ఈ కేసును ఈనెల 30వ తేదీకి వాయిదా వేశారు.

అభాగ్యులకు అండగా సీఎం చంద్రబాబు



బాధిత కుటుంబాలతో ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం, ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎల్లప్పుడూ అభాగ్యులకు అండగా నిలుస్తారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుప్పం మండలంలోని బాధిత కుటుంబాలకు రూ.20 లక్షలు విలువ కలిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతోనో, ప్రమాదాల్లోనో మృతిచెందిన, తీవ్రగాయాల పాలైన వ్యక్తుల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చేస్తున్న సాయం ఎంతో ఆసరా అవుతుందన్నారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని బాధిత కుటుంబాలకు తన సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మండల ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. బాధిత కుటుంబాల సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ ఆర్థిక సాయం



గోవిందపల్లె, మిట్టపల్లెల్లో మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గోవిందపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త వెంకటాచలం, మిట్టపల్లెకు చెందిన పార్టీ నేత సుబ్బయ్య తల్లి రామక్క సోమవారం సాయంత్రం మృతి చెందారు. టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మునస్వామి, యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి స్థానిక నేతలతో కలిసి వెంకటాచలం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం రామక్క మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు మహాదేవి జయశంకర్, రామకృష్ణప్ప, పార్టీ పంచాయతీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, నేతలు మణేష్, మహేంద్రనాయుడు, శంకర్‌చలం, ఆదిల్, అవినాశ్, రామలింగారెడ్డి, సురేష్, నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

రామకుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురంలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక పీహెసీ వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వానాకాలం ప్రారంభం అవుతుండటంతో మలేరియా వంటి జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు ఉత్పత్తి కాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర వ్యర్థ పదార్థాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎంఎల్‌హెచ్‌పీలు లావణ్య, సంధ్యా, కావ్య, ఏఎన్ఎంలు రాధా, సుకన్య, స్టాఫ్‌నర్సు రోజా, ఇతర సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పం చేరుకున్న సహాయ పరికరాలు



రామకుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని దివ్యాంగుల కోసం మంగళవారం సహాయ పరికరాలు రాజస్థాన్ నుంచి రామకుప్పం, కుప్పం మండల కేంద్రాలకు చేరుకున్నాయి. మూడు నెలల క్రితం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో సహాయ పరికరాల కోసం అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. ఆ శిబిరాల్లో అధికారులు, వైద్యనిపుణులు అర్హులను గుర్తించి జాబితాను ప్రభుత్వానికి పంపారు. మంగళవారం 188 మోటరైజ్డ్ బ్యాటరీ ట్రైసైకిళ్లు, 192 సాధారణ ట్రైసైకిళ్లు, 165 ఊతకర్రలు, 120 మూడు ఆధారాల ఊతకర్రలు, 540 వినికిడి యంత్రాలు, 414 మోకాళ్ల బెల్టులు చేరాయి. వాటిని త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు



ధర్మకర్తకు విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని స్వయంభేశ్వర స్వామి ఆలయం వద్ద నూతనంగా శివపార్వతుల కల్యాణ మండప నిర్మాణానికి పలువురు దాతలు విరాళం అందజేసినట్లు ఆలయ ధర్మకర్త సోమశేఖర్ తెలిపారు. మంగళవారం సోమలకు చెందిన చిన్నయ్యగారి చక్రపాణి, వసంతమ్మ రూ.20 వేలు, వీరమల్లుగారి వెంకట్రామయ్య, సరోజమ్మ దంపతులు రూ.10,116, దొంగరి శంకరయ్య, శెట్టివారి సురేంద్ర కల్యాణ మండపంలో విద్యుత్ వైరింగ్, ఇతర పనులకు రూ.50 వేలు విరాళం అందజేసినట్లు ధర్మకర్త తెలిపారు. కార్యక్రమంలో బీవీఎస్. బాబు, రామచంద్రయ్య, లింగయ్య, పాయల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పులిచెర్లలో పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న ఎంఈవోలు

కల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ బడులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అన్ని పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

కుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం నుంచి వేరునగ విత్తనాల పంపిణీ జరుగుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. వేరుశనగ విత్తన కాయల బస్తా (30 కిలోలు) అసలు ధర రూ.2790గా పేర్కొన్నారు. అయితే రైతులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1116 సబ్సిడీ పోను కేవలం రూ.1674 లకే లభిస్తుందని చెప్పారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్సుతోపాటు భూమి పట్టాదారు పాసు పుస్తకాలను రైతు సేవా కేంద్రాలకు తెచ్చి సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను తీసుకెళ్లొచ్చని తెలిపారు.

రాయితీపై పంపిణీకి ఊజీ బుట్టల సిద్ధం



కుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ ద్వారా రాయితీపైన పంపిణీ చేయడానికి మామిడి ఊజీ బుట్టలు సిద్ధంగా ఉన్నట్లు మండల ఉద్యానశాఖాధికారి డింపు ప్రియ తెలిపారు. ఊజీ బుట్టలు కావాల్సిన రైతులు బుధవారం నుంచి కుప్పం మండల కార్యాలయం వద్ద వాటిని పొందవచ్చన్నారు. ఒక్కో ఊజీ బుట్ట, 3 టాబ్లెట్లు కలిపి రూ.11 లకు ఇస్తామన్నారు. ఎకరానికి 8 బుట్టలు చొప్పున గరిష్ఠంగా ఒక్కో రైతుకు 40 బుట్టలు రాయితీపై పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, 1బి, భూమి పట్టాదారు పాసు పుస్తకాలు వెంట తీసుకు రావాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4న బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు రవాణా సమస్యలకు ఫోన్‌నంబరు 9959225678ను సంప్రదించాలని కోరారు.

ఈద్గా మైదానం పరిశీలన



ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈద్గా మైదానాన్ని అంజుమాన్ కమిటీ నాయకులతో కలిసి మంగళవారం సీఐ సుబ్బరాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న బక్రీద్‌ను దృష్టిలో ఉంచుకుని ముస్లిం సోదరులు ప్రార్థనలు చేస్తారని.. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఈద్గా మైదానాన్ని కార్మికులతో శుభ్రం చేయించారు. దీంతో అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం, జాఫర్‌లు పోలీసు, మున్సిపల్ అధికారులు, కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



పొదలకుంటపల్లెలో అధ్యాపకుల ప్రచారం

సోమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు కోరారు. మంగళవారం సోమల, పొదలకుంటపల్లె, వడ్డిపల్లెలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులను అధ్యాపకులు కలిసి ప్రభుత్వ కళాశాలలో పిల్లలను చేర్పాలని కోరారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఉంటుందని తెలిపారు. అలాగే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, రామకృష్ణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కెనమాకులపల్లె విద్యార్థి ప్రతిభ



చరిష్‌సాయి

శాంతిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెనమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి చరిష్‌సాయి కల్వకుర్తి అక్షరవనం రీసెర్చ్ సెంటర్‌కు ఎంపికైనట్లు తల్లిదండ్రులు బ్రాహ్మణి, కిషోర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని రీసెర్చ్ సెంటర్ 15 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపులో చరిష్‌సాయి అన్ని విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ



కొత్తరూపును సంతరించుకున్న రామకుప్పం-కోట్లగూరు, రామకుప్పం-పల్లెకుప్పం రహదారులు

రామకుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గ్రామీణ రోడ్లకు మహర్దశ కలుగుతోంది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ రోడ్లు మరమ్మతులకు నోచుకోక జనం రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడ్డారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోగ్రామీణ రహదారులను బాగు చేసే కార్యక్రమానికి సంబంధిత అధికారులు శ్రీకారం చుట్టారు. రామకుప్పం పట్టణం నుంచి కోట్లగూరు, పల్లెకుప్పంలకు వెళ్లే రహదారులు గత ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఎక్కడికక్కడ గతుకులమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. వారం రోజులుగా ఈ రెండు రహదారుల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి కొత్తగా తారు వేయడంతో రహదారులు కొత్త అందాలను సంతరించుకుని కళకళలాడుతున్నాయి. తమ గ్రామాలకు వెళ్లే రహదారుల రూపురేఖలు మారిపోవడంతో పది గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల బాగుకు నిర్ణయం తీసుకున్న ఎన్డీయే ప్రభుత్వానికి, స్థానిక శాసనసభ్యుడైన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అసలైన వెన్నుపోటుదారు జగన్‌రెడ్డే

ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ మునిరత్నం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నమ్మిన పార్టీకి, నాయకులకు, ప్రజలకు, మొత్తం రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచింది జగన్‌రెడ్డేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెన్నుపోటు గురించి దానికి అసలైన హక్కుదారులైన జగన్‌రెడ్డి, ఆయన తాపేదారులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అడుగడుగునా అభివృద్ధికి అడ్డుపడుతూ ప్రజలను రెచ్చగొట్టడానికి చూస్తున్నారని ధ్వజమెత్తారు. వెన్నుపోట్లలో రాటుదేలిన జగన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని స్థాపించారని గుర్తు చేశారు. అసలైన వైసీపీ వ్యవస్థాపకుడైన శివకుమార్ రెడ్డిని, తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిళకు వెన్నుపోటు పొడిచి సొంత ప్రయోజనాల కోసం కోర్టులకెక్కడం జగన్‌కే చెల్లిందన్నారు. సొంత చిన్నాన్నను అత్యంత కిరాతకంగా హత్య చేయించిన మనిషి జగన్‌రెడ్డేనని తీవ్రంగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు కుచ్చు టోపీ పెట్టి అనేక మార్గాలలో వారిని, రాష్ట్రాన్ని దోచుకుని జేబులు నింపుకున్న ఘనత జగన్‌రెడ్డిదన్నారు. వెన్నుపోటు వీరుడైన జగన్‌రెడ్డి, చివరకు రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. కేవలం 13 శాతం మిగిలిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను పూర్తి చేయలేకపోయారన్నారు. ఇప్పుడు పనులు శరవేగంగా జరుగుతుంటే చూసి ఓర్వలేకపోతున్నారని, పనులకు అడ్డుపడటానికి ప్రయత్నించి విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పుడు ఎయిర్ పోర్టు భూముల సేకరణకు అడ్డుపడుతూ ఆయన పార్టీ నాయకులు జగన్‌రెడ్డి డైరెక్షన్‌లో ప్రజలను రెచ్చ గొడుతున్నారని ధ్వజమెత్తారు. నీచ రాజకీయాలు జగన్‌రెడ్డి, ఆయన పార్టీ నాయకులు మానుకోవాలని, లేకుంటే ప్రజలే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సమష్టి సహకారంతోనే గ్రామాల్లోని సమస్యలకు పరిష్కారం సాధ్యమని.. తాగునీటి సమస్యకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో లీలామాధవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయాల్లోని విద్యుత్‌శాఖ, ఉద్యానశాఖ సిబ్బంది ప్రజాప్రతినిధులకు ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని ఎంపీటీసీలు, సర్పంచులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సింగిరిగుంట, పాళ్యంపల్లె సర్పంచులు అంజప్ప కృష్ణవేణి, బోడేవారిపల్లె ఎంపీటీసీ ధరణి మాట్లాడుతూ గ్రామాల్లో వీధిలైట్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు మార్చమని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. నేతిగుట్లపల్లె సర్పంచి సురేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫారం కాలిపోతే రూరల్ ఏఈ ధనంజయరావుకు ఫిర్యాదు చేసి దాదాపు వారం రోజులైనా పట్టించుకోకపోడం దారుణమని వాపోయారు. పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నా విద్యుత్ అధికారుల్లో కనికరం లేదన్నారు. పెద్ద అలసాపురం, బసినేపల్లె, బైరేమంగళం తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, సీఐ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, కోఆప్షన్ సభ్యుడు నవాజ్‌బాషా, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేలుపట్లకు చెందిన నాగరాజ కుమార్తె రమ్య(22)ను అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ కుమారుడు అశోక్‌కుమార్‌తో వివాహం జరిగింది. కొంత కాలంగా మామ రాజశేఖర్, అత్త ఈశ్వరమ్మ, ఇంటి ఆడబిడ్డ అర్చన కలిసి డబ్బులు, ఆస్తిని తీసుకురావాలని వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో తిరుమలమ్మ

చౌడేపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంఈవో తిరుమలమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఎంఆర్సీలో మండలంలోని మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో సమావేశం అయ్యారు. భోజనం నాణ్యతగా, రుచిగా, శుభ్రంగా ఉండాలని సూచించారు. వంటలలో నాణ్యతను పరిశీలించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మనస్తత్వం మరోసారి బట్టబయలు: గౌనివారి

శాంతిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చీడపురుగులుగా మారిన గంజాయి బ్యాచ్, రౌడీషీటర్ల పరామర్శకు వెళ్తున్న మాజీ సీఎం జగన్ మరోసారి తన నీచ మనస్తత్వాన్ని, నేర స్వభావాన్ని ప్రజలకు ఉదాహరణగా చూపాడని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం పోరాటాలు, ఉద్యమాలు చేసేవారి కంటే అరాచకాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడే వారంటేనే జగన్‌కు ఎంతో ఇష్టమని ధ్వజమెత్తారు. వైసీపీ నేతలు మరింత దిగజారి ప్రవర్తించడం పరిపాటిగా మారిందని తెలిపారు. జగన్ ఎన్ని నాటకాలాడినా రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ అతడిని నమ్మే ప్రసక్తే ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికం

గంగమాంబ విశ్వరూప దర్శనం



పెద్దపులి గంగమ్మ విశ్వరూప దర్శనం



ఊరేగుతున్న అమ్మవారి శిరస్సు, పూల గెరిగ

వి.కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో వెలసిన పెద్దపులి గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి ఆలయం వద్ద నుంచి అమ్మవారి శిరస్సు, పూల గెరిగ డప్పు వాయిద్యాల మధ్య పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. గంగమాంబ ఆలయం వద్ద నుంచి నారాయణనగర్, భారత్‌నగర్, లంగ్‌బజారు, సత్యసాయినగర్, ఈశ్వర్‌నగర్, ఎస్‌వీజీ వీధి మీదుగా ఊరేగింపు కొనసాగింది. ఉదయం 8 గంటలకు అగ్ని గుండ ప్రవేశంతో ఆలయానికి చేరుకున్న అమ్మవారికి వసంతోత్సవంతో శాంతింపజేశారు. ఆపై అమ్మవారు పెద్దపులి గంగమాంబగా ఆలయంలో కొలువు తీరి భక్తులకు విశ్వరూప దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త కార్తికేయన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.





- **పుంగనూరు:** పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈనెల 6 తేదీ వరకు మహా సంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా పాలేటమ్మ జాతర



ఆలయానికి పొంగళ్లతో వస్తున్న మహిళలు

కల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లెలో వెలసిన పాలేటమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి జాతర వేడుకలుఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామం నుంచి మహిళలు పొంగళ్లతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేకాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అన్నదానం నిర్వహించారు.

నంజంపేటలో...



సోమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేటలో మంగళవారం గంగజాతర వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో అమ్మవార్ల ఆలయాలను, నడివీధి గంగమ్మ ఆలయాలను సుందరంగా అలంకరించారు. అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకొచ్చి నడివీధిలో ప్రతిష్ఠించారు. మహిళలు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పొదలకుంటపల్లె, తుగడంవారిపల్లె, ఎం. వడ్డిపల్లె తదితర గ్రామాల్లో గంగజాతర వేడుకలు ప్రారంభమయ్యాయి. సూరయ్యగారిపల్లెలో గంగజాతర వేడుకలు జరిగాయి.

గంగవరం, కల్లుపల్లెల్లో సందడి

గంగవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం, కల్లుపల్లె గ్రామాల్లో మంగళవారం గంగజాతరను ఘనంగా నిర్వహించారు. గంగమ్మ తల్లిని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. అలాగే కల్లుపల్లెలో సత్యమ్మ తల్లి జాతరను నిర్వహించారు. గంగవరం, కల్లుపల్లె జాతరలో భాగంగా అమ్మవార్లను దర్శించుకోవడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

9న బోయకొండలో యోగాంధ్ర



చౌడేపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బోయకొండలో ఈనెల 9న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించ నున్నట్లు పలమనేరు ఆర్డీవో భవాని పేర్కొన్నారు. మంగళవారం ఆమె బోయకొండలో యోగా నిర్వహించేందుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 1500 నుంచి 2000 మంది తో యోగాంధ్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో యోగాంధ్ర విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో లీలామాధవి, ఎంఈవో కేశవరెడ్డి, ఏపీఎం సుబ్రహ్మణ్యం, వెలుగు సీసీలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైరోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం వెంకప్ప కళ్యాణ మండపం వద్ద ఉన్న ఆక్రమణలను పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో ఏసీపీ నాగేంద్ర ఈ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఎస్-1 కార్ కేర్ షో రూమ్ ముందున్న స్థలాన్ని ఆక్రమించిన యజమానిని ఒప్పించి 120 అడుగుల పొడవున్న ప్రహరీని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఏసీపీ మాట్లాడుతూ.. హైరోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వంద అడుగుల రోడ్డు స్థలంలో ఇప్పటికే దుకాణాలు, ఇతరత్రా నిర్మాణాలు చేపట్టిన వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించాలని కోరారు. మరో ఏసీపీ శుభప్రద, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు పనిభారం తప్పించండి

● డీఎస్‌హెచ్ జాయింట్ కమిషనర్‌కు వినతి



రమేష్‌నాథ్‌కు వినతిపత్రం అందజేసిన రాణి

చిత్తూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సులకు పనిభారం తప్పించాలని ఏపీ స్టాఫ్ నర్సెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాణి కోరారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) జాయింట్ కమిషనర్ రమేష్‌నాథ్‌కు సంఘం తరఫున వినతిపత్రం ఇచ్చారు. ఆమె మట్లాడుతూ.. 78 మంది ఉండాల్సిన స్థానంలో 68 మంది మాత్రమే పనిచేస్తున్నారని చెప్పారు. అలాగే గతంలో ఉన్న 400 బెడ్లను అపోలో వచ్చాక 850గా మార్చడం జరిగిందన్నారు. దీనివల్ల ఉన్న స్టాఫ్‌నర్సులపై పనిభారం పెరుగుతోందన్నారు. ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు కూడా చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని తెలిపారు. స్టాఫ్‌కు సిక్, డ్రస్సింగ్ గదులు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

'అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి'

పూతలపట్టు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పలురకాల యాప్‌లు రద్దుచేసి ఒకే యాప్‌ను పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు డిమాండ్ చేశారు. స్థానిక అంగన్వాడీలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు జ్యోతిరావు, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు హేమలత, వనజ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా



రైతులకు పశువుల దాణాను పంపిణీ చేస్తున్న ఎస్పీ ధరణీ ప్రసాద్ తదితరులు

బంగారుపాళ్యం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాయితీపై ఇచ్చే పశువుల దాణాను మండలంలోని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్పీ ధరణీ ప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో బంగారుపాళ్యం, పాలేరు, తిమ్మోజిపల్లె,మొగిలి, గుంతూరుకు చెందిన రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ అనీఫ్ మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మొదటి విడతలో భాగంగా మండలంలో 40 టన్నులు పంపిణీ చేశామని చెప్పారు. రూ.555లకు 50 కిలోల బస్తాను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచు కృష్ణమూర్తి, పశువైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దండుమారెమ్మ సేవలో ఎమ్మెల్యే



అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

బంగారుపాళ్యం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తగ్గువారిపల్లె గ్రామదేవత దండుమారెమ్మను ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్పీ ధరణీప్రసాద్ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు, అర్చకుడు శ్రీనివాస శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే నలగాంపల్లె గ్రామదేవత ఎల్లమ్మను కూడా ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా, తగ్గువారిపల్లె, నలగాంపల్లె, ముంగరమడుగు గ్రామాల్లో గంగజాతర సందర్భంగా ఆలయాల్లో మహిళలు పొంగళ్లు నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉప సర్పంచు లోకనాథనాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు హేమచంద్రనాయుడు, బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు బుసా నాగరాజ గౌడ్, జనార్థన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా సైకిల్ దినోత్సవం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న హర్షిత - ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు

చిత్తూరు కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొంగారెడ్డిపల్లెలోని ఎస్బీఐ బ్రాంచ్ వద్ద ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ ర్యాలీని మంగళవారం ఎస్పీ సతీమణి హర్షిత ప్రారంభించారు. రోజూ కొంత సమయం సైకిల్ తొక్కితే ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. నగర సైకిల్ లవర్స్, నేచరల్ లవర్స్, వినోద్ ఎలక్ట్రానిక్స్, గ్లామ్ సెలూన్‌లు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 300 మంది సైకిల్ ప్రేమికులు పాల్గొన్నారు. సైకిల్ లవర్స్ సంఘం ప్రతినిధులు డాక్టర్, సునీల్, ఎల్జీ వినోద్, నేచరల్ మురళి, గ్లామ్ సెలూన్ రాజ్ కమల్, రఘు స్టూడియో సూరి తదితరులు పాల్గొన్నారు

ఆక్రమణల చెరలో కళియంబాకం చెరువు

● గ్రామస్తుల ఆరోపణ

విజయపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కళియంబాకం చెరువు ఆక్రమణల చెరలో చిక్కుకుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువు మధ్యలో, చుట్టుపక్కల ఆక్రమించేసి.. సజ్జలు చల్లుతున్నారని తెలిపారు. చెరువు నిండితే ఆక్రమణదారులు చెరువు గండి కొట్టడానికి కూడా వెనుకాడడం లేదని వాపోతున్నారు. చెరువులో పశువులు మేపుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని, చుట్టూ ట్రెంచ్ కొట్టాలని కోరుతున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆక్రమణకు గురైన కళియంబాకం చెరువు

కాలువ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?

● తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు

చిత్తూరు కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గిరింపేట చౌడేశ్వరమ్మ ఆలయ నాలుగు రోడ్ల కూడలిలో సీబీ రోడ్డుకు అడ్డంగా మురుగు కాలువ నిర్మాణాన్ని నగరపాలక అధికారులు చేపట్టారు. దాదాపు 20 రోజులుగా పనులు జరుగుతూనే ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను సీబీ రోడ్డు మీదుగా దర్గా, ఎంఎస్ఆర్, పాతబస్టాండు, ఆర్టీసీ బస్టాండుకు మళ్లించేవారు. ఇపుడీ రోడ్డుపై పనులు జరుగుతుండటంతో వాహనాలన్నీ రాజీవ్‌గాంధీ రోడ్డుపై వెళ్లడంతో అక్కడ ట్రాఫిక్ సమస్యతో జనం అగచాట్లు పడుతున్నారు. ఈ మార్గంలో విద్యాసంస్థలు ఉండటంతో విద్యార్థులకూ కష్టాలు తప్పేలా లేవు. ఇకనైనా కాల్వ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



కాల్వ నిర్మాణం జరుగుతున్న రోడ్డు వద్ద ద్విచక్ర వాహనదారుల కష్టాలు

ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు

పాలసముద్రం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-బలిజకండ్రిగ ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఎస్పీ మణికంఠ ఆదేశాలతో పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తన సిబ్బందితో కలిసి మంగళవారం రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో ఈ స్టిక్కర్ల వల్ల రోడ్డు వెడల్పు డ్రైవర్లను స్పష్టంగా తెలుస్తుందని, దీనివల్ల ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందన్నారు.

డబ్బులు వసూలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా : ఎమ్మెల్యే థామస్

గంగాధరనెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ అధ్యక్ష పదవులకోసం తాను డబ్బులు వసూలు చేసినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే థామస్ సవాల్ విసిరారు. గంగాధరనెల్లూరులో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కండువా కప్పుకున్న కొంతమంది టెర్రరిస్టులకు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న తనకు, అదేవిధంగా సీఎం చంద్రబాబుకు అపఖ్యాతి తేవాలని కుట్రలు చేస్తూ, చిచ్చులు పెడుతున్నారని వాపోయారు. తనకు చెన్నైలో హాస్పిటల్స్ పని, ఎమ్మెల్యేగా ఇక్కడ పని చూసుకోవడంతోనే సతమతమవుతున్నానన్న ఆయన నైన్టీ ఎంఎల్ బ్యాచ్ చేసే పనులు పట్టించుకునేంత సమయం తనకు లేదన్నారు.

టీడీపీ కండువాలు కప్పుకున్న టెర్రరిస్టుల ట్రాప్‌లో పడకుండా అప్రమత్తం కావాలని కోరారు. టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, కామసాని కోదండరెడ్డి, రాంబాబురెడ్డి, గుంటూరు దేవరాజులు నాయుడు, మోహన్‌నాయుడు, పుష్పరాజ్, పోలురుషేంద్రరెడ్డి, నియాజ్‌అలీ, హరీష్‌యాదవ్, వర్రా యువరాజారెడ్డి, జమీర్, జీవరత్నం, సతీష్ కుమార్, పాలసముద్రం మండలానికి చెందిన నేతలు ఇందిరమ్మ, శేఖర్‌రాజు, అరుల్‌నాదన్, శ్రీరంగరాజుపురం మండలానికి చెందిన నేతలు జయశంకర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, పైనేని మురళి, కుమార్, వెంకటాచలం, దాసరి సతీష్, కార్వేటినగరం మండలానికి చెందిన చెంగ్రాయ యాదవ్, జనార్థన్‌రాజు, నాగేశ్వరరాజు, వెదురుకుప్పం మండలానికి చెందిన లోకనాథరెడ్డి, కిషన్‌చంద్, మోహన్ మురళీ, బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మునిచంద్రారెడ్డి, పెనుమూరు మండలానికి చెందిన నేతలు రుద్రయ్యనాయుడు, కృష్ణమూర్తినాయుడు, కార్జాల అరుణ, గుర్రప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరుణించు గంగమ్మా..!



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 190 రామాపురంలో గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి సారెను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం సమర్పించారు. భక్తులు అంబళ్లు పోశారు. అనంతరం మహిళా భక్తులకు చీరలను ఎమ్మెల్యే వితరణ చేశారు. అలాగే నారగల్లు పంచాయతీ కొత్తకోటలో విరుపాక్షమ్మ తిరునాళ్లను గ్రామస్తులు నిర్వహించగా.. ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో జీజేఎం ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులునాయుడు, టీడీపీ నాయకులు రవినాయుడు, ప్రభాకర్ నాయుడు, సేట్, జయలలిత, పుష్పరాజ్, కార్తీక్, కనకరాజులు, హరి, దేవ, గోవిందన్, నరసింహులు, రూప్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (టీబీ ముక్త్ భారత్ అభియాన్)లో భాగంగా టీబీ రహిత భారత్‌కు సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, జడ్పీ సీఈవో రవికుమార్, డీఎంహెచ్‌వో సుధారాణి, సంక్షేమశాఖల డీడీలు చెన్నయ్య, ఎస్. మూర్తితో పాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మ జాతర



భక్తులకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గిరింపేట న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలోని దుర్గాంబ సమేత గంగమ్మ ఆలయం ఆధ్వర్యంలో నడి వీధి గంగమ్మ జాతరను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఆయన తండ్రి చెన్నకేశవులు నాయుడు ప్రత్యేక పూజలు చేశారు. చుడా చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు రామచంద్ర, సౌందరరాజన్, శ్రీనివాసులు, రమేష్, శబరి, వీరప్ప, రాజాయాదవ్, మునిరాయల్, అంజిరాయల్, ప్రకాష్, రాము, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇరువారంలోనూ నడివీధి గంగమ్మ జాతర ఘనంగా జరిగింది.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

వెదురుకుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని బాటగంగమ్మకు, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి, గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలిరాగా, ఏర్పాట్లను కార్యనిర్వాహకులు పర్యవేక్షించారు.

కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే వైసీపీ డ్రామాలు

● వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ జగన్ రెడ్డిదే: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తమ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే డ్రామాలకు వైసీపీ తెరతీసిందని టీడీపీ నేతలు మండిపడ్డారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన చూసి ఓర్వలేక వైసీపీ నేతలు 'వెన్నుపోటు దినం' చేస్తామంటూ డ్రామాలాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలు జూన్ 4న తమ అమూల్యమైన తీర్పుతో విముక్తి పొందారని చెప్పారు. ఇది రాష్ట్ర ప్రజలకు పెద్ద పండుగరోజని అన్నారు. వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ జగన్ రెడ్డిదేనని చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికే దొంగనాటకాలకు తెరతీస్తున్నారని, వైసీపీని నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. నేతలు చంద్రప్రకాష్, త్యాగరాజన్, మోహన్‌రాజ్, సీఎం విజయ, అశోకన్, జాఫర్, మేషాక్, తదితరులు పాల్గొన్నారు.

ఉనికిని కాపాడుకోవడానికే నాటకాలు

గుడిపాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ఉనికి కాపాడుకోవడానికే వైసీపీ నాటకాలు ఆడుతోందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ విమర్శించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మద్యం స్కామ్‌లో ఎక్కడ దొరికి పోతామోనని వెన్నుపోటు కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదరక్షల కౌంటర్లలో అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు: ఈవో



అన్నదాన కేంద్రంలో భక్తులతో మాట్లాడుతున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి విచ్చేసే భక్తుల పాదరక్షలు భద్రపరిచే కేంద్రాన్ని ఈవో పెంచలకిషోర్ పరిశీలించారు. ఆలయం నిర్ణయించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అక్కడ పనిచేసే సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆలయంలో పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. అన్నదాన కేంద్రానికెళ్లిన ఆయన.. భక్తులకు రుచి, శుచితో కూడిన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. వంటశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. భోజనం ఎలా ఉందని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అన్నదాన కేంద్రంపై ఫిర్యాదులుంటే తనను నేరుగా కలవొచ్చన్నారు. ఆలయ పరిసరాల్లో ఎవరైనా తప్పు చేశారని తన దృష్టికి వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. ఆలయ ఏఈవో ప్రసాద్, హిమగిరి పాల్గొన్నారు.

పలమనేరు డీఈ చిన్నబ్బ బదిలీ

చిత్తూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ పలమనేరు డీఈ చిన్నబ్బను బదిలీ చేస్తూ సీఎండీ సంతోషరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలోని ప్రాజెక్టు విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.



మూలకండ్రిగ నుంచి నాగిరెడ్డిపల్లె ఎస్టీకాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి

ఈ రోడ్డును బాగు చేయండి మహాప్రభో..!

● నాగిరెడ్డిపల్లె ఎస్టీ కాలనీవాసుల మొర

వెదురుకుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం గ్రామ పంచాయతీ నాగిరెడ్డిపల్లె ఎస్టీ కాలనీ వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ పాలనలో రోడ్డు బాగు చేయాలని విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోయిందని వారు తెలిపారు. అలాగే మూలకండ్రిగ గ్రామం నుంచి నాగిరెడ్డిపల్లె ఎస్టీ కాలనీకి 3 కి.మీ దూరం రోడ్డు దారుణంగా ఉందని, వెంటనే బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అగచాట్లు తప్పడం లేదు

యంత్రాంగం స్పందించి నాగిరెడ్డిపల్లె రోడ్డుకు మోక్షం కల్పించాలి. రోడ్డు బాగా లేకపోవడం వల్ల మా ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భాల్లో అగచాట్లు తప్పడం లేదు.

- బాలకృష్ణ, స్థానికుడు

బస్సు సదుపాయం కల్పించండి

మా కాలనీ వరకు రోడ్డు బాగు చేసి, ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించండి. ఇంకెంత కాలం రోడ్డు సరిగా లేకుండా జీవనం గడపాలి. ఈ ప్రభుత్వంలోనైనా మాకు రోడ్డు బాగు చేయండి.

- భాస్కర్, స్థానికుడు



సంక్షిప్తంగా..

బాల్య వివాహాలను అరికడదాం

వెదురుకుప్పం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికడదామని కార్వేటినగరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి పిలుపునిచ్చారు. వెదురుకుప్పంఅంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 'కిశోర బాలికల' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి హైమావతి, అంగన్వాడీ వర్కర్లు జయసుధ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

క్షయ, ఎయిడ్స్‌పై కళాజాత

బంగారుపాళ్యం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్షయ, ఎయిడ్స్, సుఖవ్యాధులపై ప్రజలకు సులభంగా అర్థమయ్యేందుకు కళాజాత నిర్వహించినట్లు ఐసీటీసీ కౌన్సిలర్ బాబు అన్నారు. మంగళవారం బంగారుపాళ్యంలో కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ సద్దాం, క్షేత్రసహాయకులు ద్రాక్షాయిని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై అవగాహన కల్పించాలి

పాలసముద్రం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించి, వ్యక్తిగత జాగ్రత్తలు పాటించేలా చూడాలని ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను డాక్టర్ మోహనకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితులు ఉంటేనే రద్దీ ప్రాంతాలకు వెళ్లాలన్నారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్ వైజర్ మురళి పాల్గొన్నారు.

తవణంపల్లెకు వేరుశనగ విత్తనకాయలు

తవణంపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలానికి 1,110 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు కేటాయించినట్లు ఏవో ప్రవీణ్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఆధునిక పద్ధతులతోనే అధిక దిగుబడి

నగరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్త శ్రీనివాసులు సూచించారు. నగరి మండలంలోని ఎం.కొత్తూరు, వేలావడి, బుగ్గఅగ్రహారంలో మంగళవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ల వినియోగం, కోళ్ల పరిశ్రమ, పశుపోషణలపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రాఘవేంద్రయాదవ్, శాస్త్రవేత్త మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్ఐ నరసింహులు

ఐరాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇద్దరిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహులు మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కామినాయనపల్లె పంచాయతీ గోళ్లవారిపల్లెకు చెందిన సాయికృప, సాయికిషోర్‌లతో అదే గ్రామానికి చెందిన సంగీతం గణేష్ మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కర్రతో గణేష్ చేసిన దాడిలో సాయికృప, సాయికిషోర్‌లు గాయపడ్డారు. బాధితుల బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచి.. రిమాండు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన

యాదమరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, క్షయవ్యాధులపై కళాజాత బృందం యాదమరిలో మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, కోర్ సంస్థ నిర్వాహకులు, సీహెచ్‌వో లక్ష్మీనారాయణతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్ సంస్థ మేనేజర్ సద్దాం, ద్రాక్షాయణి, సెల్వి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ● సంతగేటు పీహెచ్‌సీలో వైద్యులు డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఆర్. కమతంపల్లెకు చెందిన నాగరాజ భార్య చంద్రకళ (25) అత్తతో గొడవపడి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.